


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

వైఎస్ఆర్ కడప

మంగళవారం 20 మే 2025

పేజీలు - 08




# మహా భద్రతపైనే.. ఫోకస్!

- మూడు రోజులు సీఎం, మంత్రులు కడపలోనే మకాం
- పలు రాష్ట్రాల నుంచి తరలిరానున్న టీడీపీ శ్రేణులు
- నేతల భద్రత, ట్రాఫిక్ సమస్యపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి
- 5వేల మంది పోలీస్ బలగాల తో పాటు ప్రత్యేక దళాల నిఘా
- కడపలోనే మకాం వేయనున్న రాష్ట్ర పోలీస్ యంత్రాంగం

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

కడప జిల్లాలో తొలిసారి జరుగుతున్న మహానాడును తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 43 ఏళ్ళ పార్టీ చరిత్రలో కడప మహానాడు ఒక మైలురాయిలా నిలిచిపోవాలని ఆపార్టీ భావిస్తోంది. అందుకు తగ్గట్లు భారీ కార్యచరణ రూపొందించింది. ఇప్పటికే వేదిక నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే మహానాడు సందర్భంగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారాలోకేష్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, పార్టీ కీలక నేతలు, వీఐపీలు మూడు రోజులు కడపలోనే బస చేయనున్నారు. అదేవిధంగా మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, పుదుచ్ఛరీ వంటి ప్రాంతాలతో పాటు గల్ఫ్ నుంచి కూడా పెద్ద ఎత్తున ఎన్ఆర్ఐలు తరలిరానున్నారు. ఈ క్రమంలో వారి భద్రత పోలీస్ యంత్రాంగానికి సవాల్‌గా మారింది. దీనిపై రాష్ట్ర పోలీస్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. రాష్ట్ర పోలీస్ యంత్రాంగంతో పాటు ప్రత్యేకంగా పారా మిలిటరీ దళాలను వినియోగించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై హోం శాఖ మంత్రి అనిత ఆశాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఎం బాబు భద్రతపైనే ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.

టీడీపీ పండుగ మహానాడుకు ఈనెల 27,28,29 తేదీలలో కడప వేదికకానుంది. చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురంలో సభా నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే ప్రతినిధుల వేదిక, బహిరంగా సభాస్థలికి సంబంధించిన 135 ఎకరాల భూమి చదును పనులు పూర్తయ్యాయి. పార్కింగ్‌కు మిగతా 2పేజీలో

### ఇంటికో ఇంజనీర్

# అదే సీఎం లక్ష్యం!

- యువత ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి
- అధునాతనా వసతులతో కడప స్టార్టప్
- జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి ఎస్.సవిత
- పీ4 స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ నిర్మాణానికి శంఖుస్థాపన



కడప ప్రతినిధి- మేజర్‌న్యూస్: నేటి యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. సోమవారం కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో ఏర్పాటు కానున్న "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" నిర్మాణానికి జిల్లా ఇంచార్జి మంత్రి సవిత భూమి పూజ, శంఖుస్థాపన చేశారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, జేసీ అదితిసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది చంద్రబాబు నాయుడు అన్నారు. ఆశించే స్థాయి నుండి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతిఇంటి నుండి ఒక స్టార్ట్ అప్ ఎదగాలనే ఆయన ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం అన్నారు. ఇలాంటి స్టార్ట్ ఆప్ కడప కార్యక్రమాన్ని మన జిల్లాలో ప్రప్రథమంగా ఏర్పాటు కావడం మన అదృష్టం అన్నారు. అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక . ...మిగతా 2పేజీలో

### ప్రభుత్వ పథకాలపై మరింత

# దృష్టి సారిస్తాం

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్: ప్రభుత్వ పథకాలు,సేవల ప్రజా స్పందనలపై మరింత దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్, యోగాంధ్ర -2025 క్యాంపెయిన్, ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజా స్పందనలు, జిల్లా సబ్ ...మిగతా 2పేజీలో

### గోపవరం ఉప సర్పంచ్‌గా

# వైకాపా అభ్యర్థి గెలుపు



ప్రొద్దుటూరు,మేజర్‌న్యూస్: మండలంలోని గోపవరం పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సోమవారం ఎట్టకేలకు పూర్తయింది. కాగా ఎన్నిక నేపథ్యంలో ...మిగతా 5పేజీలో

### కడపలో నిర్వహించే మహానాడును

# విజయవంతం చేయాలి

### మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



2లో

# ఇంటికో ఇంజనీర్.. అదే సీఎం లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)





వసతులతో రూపుదిద్దుకోనున్న కడప స్టార్ట్ అప్ కేంద్రం యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధి కి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేశగా కీలక పాత్ర పోషించనుందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని ఈ స్టార్ట్ అప్ హబ్‌ను ముందుకు తీసుకువెళ్తామన్నారు. 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జి+3 అంతస్తులతో, పిఈబి టెక్నాలజీ ఆధారంగా ఈ స్టార్ట్ అప్ కేంద్ర భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. స్టార్టప్ కడప కేంద్రం యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తూ, నూతన ఆవిష్కరణను ప్రోత్సహించడమే కాక, ఆలోచనలను అభివృద్ధి చెందిన వ్యాపారాల వరకు అన్ని దశల్లో స్టార్టప్‌లకు మద్దతు అందించే లక్ష్యంతో ముందుకెళ్తుందన్నారు. ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, వృత్తిపరమైన వర్క్‌స్పేస్‌లు, సహకార వాతావరణం వంటి అంశాలతో యువతకు అవసరమైన అన్ని వనరులు ఈ కేంద్రం అందించనుందన్నారు. రాయలసీమ జిల్లాల్లోని యువత స్టార్ట్ అప్ కడప సెంటర్ ద్వారా రాష్ట్ర.ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకుని.. వారి కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు.

### రూ.10 కోట్ల అంచనాతో నిర్మాణం..

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో రూ. 10 కోట్లు అంచనా వ్యయంతో ఈ స్టార్ట్ అప్ సెంటర్ నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. ఇందుకు గాను స్థానిక షిర్డీసాయి ఏక్ట్రికల్స్ రూ.4 కోట్లు విరాళం అందించిందన్నారు. స్టార్టప్ కడప కేవలం ఒక భవనం మాత్రమే కాదని.. ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా ఇది నిలవనుందన్నారు. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా ఉపయోగపడనుందన్నారు. కడప జిల్లా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచే దిశగా.. ఈ పీ-4 స్టార్ట్ అప్ ఎంటర్ప్రెన్యూషిప్ పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన.. నిర్మాణ ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను బిల్డింగ్ నమూనా మ్యాపు ద్వారా క్షుణ్ణంగా మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత నడిబొడ్డున ఉన్న కడప నగరంలో రూపుదిద్దుకుంటున్న పీ-4 స్టార్ట్ అప్ కడప భవన నిర్మాణం భవిష్యత్తులో యువతకు గొప్ప ఉపాధి వనరుగా మరనుందన్నారు. సాంకేతిక విద్యా నైపుణ్యం ఉన్న ప్రతి విద్యార్థి, యువతకు ఎంతో ఉపయోగకరం అన్నారు. ప్రతి ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి ఒక ఎంటర్ప్రెన్యూషిప్‌ను తీసుకురావాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలు నేటి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేయనుం దన్నారు. ఎంటర్ప్రెన్యూషిప్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయం అన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతికి, యువతలో నూతన ఆవిష్కృత పటిమను, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించబడిన "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" మన జిల్లా యువతకు చేరువలో రూపుదిద్దుకోవడం అదృష్టకరమైన, ఆనందదాయకమైన విషయం అన్నారు. తెదేపా .పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ... కడపలో స్టార్ట్ అప్ సెంటర్ ద్వారా.. స్థానిక యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి.. వారి ఆలోచనలకు సరికొత్త రూపం కల్పిస్తూ ఎంటర్ప్రెన్యూషిప్ అవకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సరికొత్త ఆలోచనలకు కడప నగరం వేదిక కావడం గర్వించదగ్గ విషయం అన్నారు.

# ప్రభుత్వ పథకాలపై మరింత దృష్టి సారిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్డినేట్ కోర్టులలో టాయిలెట్స్ కాంప్లెక్స్ వంటి వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి తోపాటు.. జేసీ అదితిసింగ్,డి ఆర్ వో విశ్వేశ్వర నాయుడు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ... స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ కింద అమలు చేస్తున్న ప్రాజెక్ట్స్ లలో ఆయా జిల్లాలకు సంబంధించిన సమస్యలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేయడం జరుగుతుందన్నారు..ఆయా జిల్లాలకు సంబంధించి ప్రాజెక్టు పనులలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల జూన్ 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు యోగ ప్రోటోకాల్స్ పాటించి విజయవంతం చేయాలన్నారు.దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైజాగ్ లో జరిగే యోగా దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా, మండల్, విలేజ్ స్థాయిలో యోగ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.యోగా ప్రమోషన్ అండ్ అవేర్నెస్ యాక్టివిటిస్ లో భాగంగా ఈ నెల 21 మే అన్ని జిల్లాల్లో కర్టెన్ రైజన్ కార్యక్రమం నిర్వహించి జిల్లాల్లో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ యోగా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి మండలంలో యోగా రిజిస్ట్రేషన్స్ ,మాస్టర్ ట్రైనర్లను, అనువైన ప్రాంతాలను గుర్తించించాలన్నారు. మండల స్థాయిలో యోగ పై ర్యాలీలు,రంగోలి, కాంపి టీషన్స్ నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్‌లు యోగాంధ్ర పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా సబార్డినేట్ కోర్టులలో దెబ్బతిన్న మరియు కొత్త టాయిలెట్స్ కాంప్లెక్సలను పూర్తి చేయాలన్నారు.ప్రభుత్వ పథకాలు సేవలపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు.సీఎస్ విసి లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలోని పెద్దముడియం మండల సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి రెవెన్యూ భూముల సమస్యలను పరిష్కరిస్తామని సీఎస్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీవో హాజరతయ్య, ఆర్ అండ్ బి ఎస్ ఈ చంద్ర శేఖర్,జిల్లా పర్యాటక అధికారి సురేష్, తదితరు అధికారులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజల సంక్షేమమే విశాఖ బ్యాంక్ లక్ష్యం




కడప - మేజర్‌న్యూస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకున్నా, సామాన్య ప్రజలకు సంక్షేమానికి విశాఖపట్నం కో ఆపరేటివ్ లిమిటెడ్ బ్యాంక్ సేవలు అందిస్తుందనీ బ్రాంచ్ డైరెక్టర్ జెవి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. సోమవారం కడప బ్రాంచ్ సర్వ సభ్యుల సమావేశం కడప శివప్రియ కళ్యాణ మండపంలో నిర్వహించారు ఈ సందర్భంగా జెవి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సాధారణ ప్రజలకు, చిన్న వ్యాపారులకు,విద్య వైద్య అభివృద్ధికి,వృత్తికారులకు రుణాలు అందించడమే కాకుండా,ప్రజల పొదుపు పై ఇతర వాణిజ్య బ్యాంకులకన్నా అధిక వడ్డీని చెల్లిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు కొనుగోలు చేసే శక్తి ఉన్నపుడే భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం పన్నుల భారం పెరుగుతుంది ఆదాయం పెరగటం లేదన్నారు ప్రజల పొదుపుపై ఇతర బ్యాంకుల కన్నా విశాఖ పట్నం బ్యాంకు అధికవడ్డీని అందిస్తూ ప్రజాసంక్షేమానికి తోడ్పడుతున్నామన్నారు. ఈ ఏడాది 7 కోట్ల డిపాజిట్లు ఉండగా 30 కోట్ల రూపాయల రుణాలు కడప ప్రాంత ప్రజలకు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పించినట్టు తెలిపారు. బ్యాంక్ అభివృద్ధికి,సేవల విస్తరణకు,సహకరిస్తున్న సభ్యులకు,ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డైరెక్టర్ నారాయణ స్వామి,జోనల్ మేనేజర్ వెంకటేశ్, కడప బ్రాంచ్ మేనేజర్ తులసి కుమార్ సభ్యులు పాల్గొన్నారు.

# మహా భద్రతపైనే ఫోకస్!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి మూడు వేల ఎకరాల్లో భూమి లెవెలింగ్ పనులు సాగుతున్నాయి. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం నుంచి వేదిక నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాస్ జిల్లాలోనే మకాం వేశారు. పోలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి(వాసు) ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మంత్రులు జిల్లాలో పర్యటించారు. ప్రధానంగా హెూం మంత్రి అనిత, జిల్లా ఇంఛార్జి మంత్రి సవిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్‌అండ్‌బి శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, అమర్‌నాథరెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ రామ్ భూపాల్ రెడ్డి, ఎమ్మెల్యే పులివర్తి నాని, నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, దామచర్ల సత్య, కొమ్మారెడ్డి పట్టాభి తదితరులు జిల్లాలో పర్యటించారు. మహానాడు విజయవంతంపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహానాడు పనులను పరుగులు పెట్టించేందుకు అనువుగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. జనసమీకరణ కోసం నియోజక వర్గాలకు ప్రత్యేక పరిశీలకులను నియమించారు. అయితే ఈ క్రమంలో మహానాడు భద్రత కీలకంగా మారింది. హెూం మంత్రి అనిత జిల్లా పోలీస్ యంత్రాంగంపై ప్రత్యేక చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు మూడు రోజుల పాటు కడపలోనే మకాం వేయనున్నట్లు సమాచారం. అదేవిధంగా రాష్ట్ర మంత్రులు, ఇతర వీఐపీలు సైతం కడపలోనే బస చేస్తున్నారు. దీంతో పోలీసు రక్షణ ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌తో పోలీస్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు నిత్యం సంప్రదిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి ఎస్పీ ఇప్పటికే పలు పర్యాయాలు సభా వేదిక, సీఎం బస చేసే ప్రాంతాలను పరిశీలించారు. రాయలసీమ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ నేడో..రేపో కడపకు చేరుకుని ఇక్కడే మకాం వేయనున్నట్లు తెలుస్తోంది. కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లా ఎస్పీలు సైతం కడపకు రానున్నారు. దాదాపు రాయలసీమ జిల్లాలకు చెందిన 5వేల మంది పోలీస్ యంత్రాంగం మహానాడుకు భద్రత కల్పించనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు కార్యచరణ రూపొందిస్తున్నారు. అదేవిధంగా కడప బాకరాపేటలోని 11 బెటాలియన్‌తో పాటు కర్నూలు 2వ బెటాలియన్ పోలీస్ బలగాలను ప్రత్యేకంగా వినియోగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సీఎం చంద్రబాబు నగరంలో బస చేస్తారా?, ప్రతినిధుల సభా వేదిక సమీపంలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారా? అనేది స్పష్టంగా తెలియటం లేదు.అదేవిధంగా ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తకుండా చేయడం అనేది కూడా పోలీస్ యంత్రాంగానికి పెద్దసవాల్‌గా మారనుంది. ప్రతినిధుల సభకు రెండు రోజుల పాటు హాజరయ్యే నేతల వాహనాలకు పార్కింగ్ సమస్య పెద్దగా లేకున్నా మూడవరోజు 29వ తేదీ జరిగే బహిరంగసభకు తరలివచ్చే వాహనాలకు పార్కింగ్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి సారధ్యంతో మూడు వేల ఎకరాలు పార్కింగ్‌కు కేటాయించి భూమి చదును చేసే పని దాదాపు పూర్తయింది. అదేవిధంగా సమీపంలో మరికొన్ని వందల ఎకరాలు ఖాళీగా ఉండటంతో ఆ ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాటు చేసే దిశగా పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ సభకు దాదాపు 5 లక్షలకు పైగా జనం తరలివచ్చే అవకాశం ఉన్నట్లు టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. వీటిపై హెూం మంత్రి అనిత ఆదివారం జిల్లా పోలీస్ అధికారులతో చర్చించారు. నేడో..రేపో పోలీస్ ఉన్నతాధికారులు సమావేశమై మహానాడు భద్రతపై ప్రత్యేక కార్యచరణ రూపొందించనున్నారు.

## గోపవరం ఉప సర్పంచ్‌గా వైకాపా అభ్యర్థి గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

గోపవరం పంచాయతీ కార్యాలయం వద్ద పోలీసుల భారీ బందోబస్తు డీఎస్పీ పూతి భావన ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఉప సర్పంచ్ ఎన్నికను 11 గంటలకు ఎన్నికల అధికారి రామచంద్రారెడ్డి నిర్వహించారు. గోపవరం పంచాయతీకి 100 మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలన్నీ బంద్ చేసి, 144 సెక్షన్ విధించారు. ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా టిడిపి కి చెందిన వార్డ్ మెంబర్స్ ఎవరూ ఎన్నిక సమయంలో పంచాయతీ కార్యాలయం వద్దకు రాలేదు. కేవలం వారి నుండి ఒక వార్డ్ మెంబర్ వచ్చి ఎన్నికకు సహకరించింది. దీంతో కోరమ్, మెజారిటీ వుండటంతో ఎన్నికల అధికారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బీరం రాఘవేంద్రారెడ్డిని ఉపసర్పంచిగా ఎన్నిక చేసి నియామక పత్రం అందజేశారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పిఎండిఎస్ సాగు



**చక్రాయపేట, మేజర్‌న్యూస్:** ఎర్ర బొమ్మనపల్లి గ్రామంలో రైతు రవీంద్రారెడ్డి కి చెందిన 10 ఎకరాలలో 20 రకాల విత్తనాలతో పీఎండీఎస్ వేయడం జరిగిందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ప్రతాప్ తెలిపారు. వరి ప్రధాన పంట వేసే ముందు పిఎండిఎస్ వేసి కలియదున్నాలన్నారు ప్రధాన పంట వేయడం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. పంటకు పురుగులు పట్టడం తెగుళ్లు లాంటివి రాకుండా ఉంటాయని పంట దిగుబడి మంచిగా రావడమే కాక ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గ్రామసభలో భాగంగా సోమవారం రోజు గ్రామాల లో ఆదర్శ రైతును గుర్తించి ఆయన అనుభవాలను తోటి రైతులకు చెప్పి పిఎండిఎస్ వేయడం జరిగిందన్నారు. అదే గ్రామంలో 8 మంది రైతులు పీఎండిఎస్ వేయడానికి ముందుకు రావడం జరిగిందని పిఎండిఎస్ కిడ్స్ కూడా తయారు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ మస్తాన్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, జయచంద్ర, ఎన్ ఎఫ్ ఐ లు మౌనిక, శ్రీ స్నేహ, శ్యాం విక్టర్, ఐసిఆర్పి వసంతకుమారితో పాటు రైతులు పాల్గొన్నారు

## ప్రజా సంక్షేమాన్నిమరిచిన కూటమి ప్రభుత్వం

**చూస్తున్నారన్నారు.మేఘ డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురుచూపులు**
**ఉచిత బస్సు ప్రయాణం కోసంమహిళలుఎదురుచూపులు**
**పులివెందుల మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి**



**పులివెందుల, మేజర్‌న్యూస్:** రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారని పులివెందుల మండలం అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వం మరిచిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం మహిళలు ఎదురుచూపులు చూస్తున్నారన్నారు. మేఘ డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురుచూపులు చూస్తున్నారన్నారు.నిరుద్యోగయువత 20,లక్షల ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. నెలకు 1500వందలరూపాయలువస్తాయనిమహిళలుఎదురుచూపులు చూస్తున్నారన్నారు. నెలకు రూ.3000 వేలు వస్తుందని నిరుద్యోగులు ఎదురుచూపులు చూస్తున్నారన్నారు. ప్రతి పేదవాడికి రెండు సెంట్లు ఇంటి స్థలం ఎదురుచూపులు చూస్తున్నారు.అన్నారు.ప్రజలు పనులు దొరకక పస్తులు ఉండే కాలం ఏర్పడుతుంది అన్నారు. రైతులకు ఇచ్చిన హామీ 20,000 వేల రూపాయలు పథకం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో పనులు లేక చాలామంది ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



కలసపాడు,మేజర్‌న్యూస్: కలసపాడు మండలంలోని మహా నంది పల్లి గ్రామానికి చెందిన బిజువేముల పుల్లారెడ్డి కుమారుడు సాఫ్ట్వేర్ ఉద్యోగి బిజీవేముల శివానందరెడ్డి రైలు కింద పడి ఇటీవల మరణించడం జరిగింది ఈ విషయం తెలిసిన వెంటనే సమాచారం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి మృతుని ఇంటికి వచ్చి వారి తండ్రి పుల్లారెడ్డి వారి పెద్దనాన్న పెద్దమ్మలతో సమాచారం తెలుసుకొని జరిగిన సంఘటన పై వారిని ఓదార్చడం జరిగింది. ఆ భగవంతుడు వారికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని. ధైర్యంగా ఉండాలని కోరారు. చిన్న తనంలోనే తల్లిని పోగొట్టుకున్న శివానందరెడ్డిని. అన్ని తాను ఒక్కగానొక కుమారుని పెంచి పెద్ద చేసి 9 నెలల క్రితం వివాహం చేసి ఇప్పుడు హఠాత్తుగా చనిపోవడం పుల్లారెడ్డినీ వారి కుమార్తె స్వర్ణలతను ఓదార్చడం. వారు మనోవేదనకు గురికావడం జరిగింది.

# ప్రపంచ తేనెటీగల దినోత్సవం

**జమ్మలమడుగు, మేజర్‌న్యూస్:** తేనెటీగల పెంపకాన్ని ఎపి కల్చర్ అంటారు.అడవుల నరికి వేత వల్ల తేనెటీగల పెంపకం యొక్క ఆవశ్యకత ఏర్పడింది.1934మే20నస్లోవేనియాదేశంలో తేనెటీగల పెంపకంలో నిపుణుడైన అంథోన్ జంసా జన్మించారు. డిసెంబర్ 2017లో ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు, అంథోన్ పుట్టిన మే 20ని ప్రపంచ తేనెటీగ రోజుగా గుర్తించాలన్న స్లోవేనియా ప్రతిపాదనను ఆమోదించాయి అప్పటినుండి తేనెటీగల దినోత్సవం నిర్వహించ బడుతున్నది. మానవునికి మేలు చేయు కీటకాలలో అతి ముఖ్యమైనవి తేనెటీగలు. తేనెటీగలు పూల మీద వాలుతూ మకరందాన్ని సేకరిస్తుంది. పనిలో పనిగా పూలలోని పుప్పొడిని గ్రహించి తరువాత స్పృశిస్తున్న పూలకు అందిస్తూ జీవనం సాగిస్తుంది. ప్రకృతిలో ఇదొక అద్భుతంగా చెప్పవచ్చు. వీటి నుండి తేనె మాత్రమే కాకుండా ఇతర ముఖ్యమైన ఉప ఉత్పత్తులు మైనము, పుప్పొడి మరియు ప్రొపొలిస్ లభ్యమవుతాయి. మొక్కలలో పరపరాగ సంపర్కం తేనెటీగల ద్వారా జరగడంవల్ల వ్యవసాయం, ఉద్యానవన పంటలలో దిగుబడులు పెరిగినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 75% ఆహార పంటల దిగుబడులు పెరగడా నికి, నాణ్యత చేకూరడానికి ఎంతో కొంతమేరకైనా తేనెటీగలు, అడవి తేనెటీగలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. తేనెటీగల శరీరమంతా సన్నటి వెంట్రుకలతో కూడి పుప్పొడి సేకరించుటకు అనుకూలముగా ఉంటాయి. అంతేగాకుండా వాటి నాలుక, కళ్ళు మకరందాన్ని, పుప్పొడిని స్వీకరించుటకు అనుకూలంగా ఉంటాయి. ఒక్కొక్క తేనెటీగ కొన్ని వందల పుష్పాలను దర్శిస్తాయి. అందువలన పుప్పొడుల పరపరాగ సంపర్కం జరిగి, పంటల అధిక ఉత్పత్తికి దోహదం చేస్తాయి. తేనెటీగలు సంఘ జీవులు. ప్రతి తేనె పట్టులో ఒక రాణి ఈగ, కొన్ని వందల పోతుటీగలు, కొన్ని వేల సిపాయి ఈగలు కలిసి జీవిస్తాయి.ఒక పట్టులో 50,000వరకు తేనే ఈగలు ఉంటాయి.తేనెను తీసుకోవడం మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు. ఆయుర్వేద వైద్యంలో ఎక్కువగా తేనెను వాడుదురు. పౌష్ఠిక గుణాలతో కూడి, తొందరగా అరిగే ఆహార పదార్థం తేనె కంటే మరొకటి లేదు. స్వచ్ఛమైన తేనె ఎన్నటికీ చెడిపోదు. పంచదార కన్నా రెండు రెట్లు ఎక్కువ తీపిగా ఉండే తేనె క్రిమి సంహారిక గుణాన్ని కలిగి ఉంటుంది. తేనెలో 14నుంచి 18 శాతం వరకు తేమ ఉంటుంది. ఇందులో నీటి శాతం తక్కువగా ఉండటంతో పులియడం, పాడవడం జరగదు. తేనె పట్టునుండి సేకరించిన తేనె మంచి పోషక ద్రవ్యం, తేనె పట్టునుంచి తయారైన మైనం కొవ్వుత్తులు, పాలిష్‌లు, మోడల్స్ తయారీకి ఉపయోగిస్తారు. తేనెటీగ విషాన్ని కీళ్లనొప్పుల చికిత్సలో ఉపయోగిస్తారు. తేనె మంచి యాంటీసెప్టిక్ పదార్థం. కాబట్టి దీన్ని పుండ్లమీద పూసి ఇన్‌ఫెక్షన్‌ను నివారిస్తారు. నగరవాసులు



ఊబకాయం నుంచి బయటపడేందుకు, ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం కలిపి తాగేవారి సంఖ్య పెరిగింది. మనకు తిండి కొరత ముంచుకు రాకుండా ఉండాలంటే తేనెటీగలు కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఐక్య రాజ్య సమితి హెచ్చరిస్తోంది. ఇందుకోసం ప్రతి సంవత్సరం మే 20వ తేదీన ప్రపంచ తేనెటీగల దినోత్సవం జరుపుకోవాలని పిలుపు ఇచ్చింది. వ్యవసాయంలో రసాయనాలు వాడటం మానేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతి పాటించాలని సూచించింది. సంవత్సరం ప్రపంచ తేనెటీగ దినోత్సవం యొక్క థీమ్, " ప్రకృతి నుండి ప్రేరణ పొందిన తేనెటీగలు మనందరినీ పోషించడానికి ", తేనెటీగలు వ్యవసాయ,ఆహార మరియు పర్యావరణ వ్యవస్థల సమ తుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి.సమాజంలో ప్రతి ఒక్కరికి తేనెటీగలను పరిరక్షించాల్సిన బాధ్యత ఉంది. వీటికి హానిచేసే పనులు మానుకోవాలి. ఇళ్లదగ్గర తేనెటీగలకోసం పూల మొక్కలు పెంచాలని ఆహార, వ్యవసాయ సంస్థవారు సూచిస్తున్నారు. ఎప్పుడైతే మనం రసాయన సేద్యానికి మరలామో, తేనెటీగల మనుగడ ప్రమాదంలో పడింది. పంటలపై విచక్షణా రహితంగా ఫెస్టిసైడ్స్ వాడడంవల్ల తేనెటీగల అభివృద్ధి తగ్గుతోంది. ఆ మేరకు పంటలు కూడా తగ్గు తున్నాయి. దానికి మరిన్ని రసాయనిక ఎరువులు వాడటం వల్ల మరిన్ని పర్యావరణ సమస్యలు ఉత్పన్నమై మొత్తం భూగోళం ప్రమాదపు అంచులకు చేరుకుంది. అందుకే మిద్దె తోటలు, పెరటి తోటలను పెంచాలి. మనం తేనెటీగల్ని పెంచిపోషిస్తే, అవి మనల్ని పెంచి పోషిస్తాయి. ఎందుకంటే ప్రకృతికి ఎంతో మేలుచేసే వీటి మనుగడ తప్పనిసరి అంటున్నారు పర్యావరణ ప్రేమికులు.తేనెటీగలకు హాని కలిగించే పురుగుమందులను నిషేధించే చట్టం తేవడం ద్వారా స్లోవేనియా మిగతా దేశాలకు మార్గదర్శకంగా నిలిచింది.కాబట్టి ఆ దేశ స్ఫూర్తితో తెనేటీగలను రక్షిద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం- ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం.

## ఉచిత అడ్మిషన్లభర్తీ ఎక్కడ

**పట్టించుకోనివిద్యాశాఖ అధికారులు**
**ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు జగన్**



**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** ప్రైవేటుపాఠశాలల్లో ఉచిత విద్య అడ్మిషన్లభర్తీపై మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఆర్ఎస్ఓ)రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపరెడ్డి ఆరోపించారు సోమవారం ప్రొద్దుటూరు డిప్యూటీ విద్యాశాఖ అధికారి మీనాక్షికి రాజుపాళెం మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు వెనుకబడిన వర్గాల వారికి ఒకటవ తరగతి విద్య కోసం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లుఉచితంగా అందించాలని నోటిఫికేషన్ జారీ అయిందన్నారు పేద వర్గాల పిల్లల అడ్మిషన్ల పై తల్లిదండ్రులకు మండల విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు అయితే మండల విద్యాశాఖ అధికారులు ఈ అడ్మిషన్ లపై ఎలాంటి ప్రచారం మండలంలో చేయలేదన్నారు. దగ్గరలోని ప్రైవేటు పాఠశాలలో వెనుకబడిన వర్గాల పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్లు కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహించారన్నారు ఉచిత అడ్మిషన్ లపై ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి నెలరోజులు గడిచి ఆఖరు రోజు అయిన మండల విద్యాశాఖ అధికారులు శ్రద్ధ తీసుకోలేదన్నారు మండలానికి ఇద్దరు విద్యాశాఖాధికారులను నియమించిన విద్యా ప్రమాణాలను పెంచడంలో అలసత్వం వహిస్తున్నారు అన్నారు వెంటనే డిప్యూటీ విద్యాశాఖ అధికారి జిల్లా విద్యాశాఖ అధికారులు వీరిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సతి ప్రచార పత్రం అమలు - ఆధార్ కోసం సర్వేపై ఓరియంటేషన్ కార్యక్రమం

**కడప, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఇంచార్జ్ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప గౌరవ ఎల్ వెంకటేశ్వరరావు సూచనల మేరకు సి.ఆసిఫా సుల్తానా, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్, ఇంచార్జ్ సెక్రటరీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు న్యాయ సేవా సదన్ కడప నందు"నిరుపేద పిల్లల కోసం సతి ప్రచార పత్రం అమలు - ఆధార్ కోసం సర్వే మరియు ట్రాకింగ్ మరియు సమగ్ర చేరికకు ప్రాప్యత" అనే అంశంపై ఓరియంటేషన్ సెషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద పిల్లల కోసం సతి ప్రచార పత్రం అమలు - ఆధార్ కోసం సర్వే మరియు ట్రాకింగ్ మరియు సమగ్ర చేరికకు ప్రాప్యత, ఆధార్ నమోదు, న్యాయసహాయము మరియు సంక్షేమ పథకాలు మొదలు అంశాలను వివరించారు. పేద పిల్లల కోసం డిస్టిక్ సతి కమిటీని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కమిటీ పేద పిల్లల యొక్క అవసరాలను గుర్తించి తగు న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ హెగ్డే, డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ ఎంవి నాయుడు, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, డిస్టిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## సప్లమెంటరీ పరీక్షల్లో 7 మంది విద్యార్థులు గైర్హాజరు

**వేంపల్లె, మేజర్‌న్యూస్:** పదోతరగతి సప్లమెంటరీ పరీక్షల్లో 7 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు. సోమవారం నుంచి పదోతరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం కావడం జరిగింది. వేంపల్లెలోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో సప్లమెంటరీ తెలుగు పరీక్షకు 31 మంది విద్యార్థులు పరీక్షలు రావాల్సి ఉండగా 24 మంది మాత్రమే హజరు అయ్యారు. దీంతో 7 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు గైహజరు అయినట్లు చెప్పారు.

# సిపి బ్రౌన్ లైబ్రరీ సేవలు అభినందనీయం

### జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత - సి.పి.బ్రౌన్ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన




**కడప ప్రతినిధి- మేజర్‌న్యూస్ :** భాషా, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆ దిశగా సిపి బ్రౌన్ గ్రంథాలయం విశేష కృషి చేస్తోందని.. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కడప లోని.. యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రం అదనపు నూతన భవన నిర్మాణానికి జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, జేసీ అదితిసింగ్, తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డా. పద్మ, తదితరులు హాజరయ్యారు. అనంతరం గ్రంథాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సవితమ్మ మాట్లాడుతూ... తెలుగు బాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. తెలుగు బాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రం ద్వారా.. తెలుగు భాష కీర్తి పతాకాలు ప్రపంచ దేశాల్లో సైతం రెపరేపలాడుతున్నాయన్నారు. కడప అంటే ఇతర ప్రాంత ప్రజలకు చిన్నచూపు ఉందని, కానీ బ్రౌన్ గ్రంథాలయం లాంటి విజ్ఞానసౌధం ఆ అపనిందను రూపుమాపేలా వెలసిందన్నారు. గ్రంథాలయంలో ఉన్న తాళపత్ర గ్రంథాలను, ఇతర వ్రాతప్రతులను ప్రత్యేకంగా చూపిస్తూ డాక్యుమెంటరీ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. చిత్రకూటం అమృతవల్లి, కీ.శే. సంపత్ కుమార్ గార్ల సౌజన్యంతో ఇచ్చిన స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో నిర్మాణ పనులకు నోచుకోలేక పోయిన గాంధాలయ భవన నిర్మాణ పనులకు ఈ ప్రభుత్వంలో మోక్షం వచ్చిందన్నారు. ఈ భవన నిర్మాణం కోసం జనుమద్ది విజయ భాస్కర్ చేసిన కృషి అభినందనీయం అన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుదే అన్నారు. 1995లో ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు బ్రౌన్ గ్రంథాలయాన్ని అధికారికంగా ప్రారంభించారని, ఇప్పుడు నిర్మించబోయే నూతన భవనాన్ని కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభింపజేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. తెలుగు భాషా ప్రియులకు సిపి బ్రౌన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. తెలుగు భాష సాహిత్యాన్ని.. పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం.. "చార్లెస్ ఫిలిప్ బ్రౌన్" అని ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. సి.పి.బ్రౌన్ ఈస్ట్ ఇండియా ఉద్యోగిగా మన దేశానికి వచ్చి తెలుగు నేర్చుకోవడమే కాకుండా.. తెలుగు భాషను ఆంధ్రరాష్ట్ర వ్యాప్తంగా పారిమళింపజేసిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. తెలుగు భాషా అభిమానిగా తాళపత్ర గ్రంథాలను సేకరించి.. తెలుగు వారికి వేమన విజ్ఞాన సారాంశాన్ని పంచిన ఘనత సి.పి. బ్రౌన్ కే దక్కుతుందన్నారు. సి.పి బ్రౌన్ సేకరించిన గ్రంథాలను భద్రపరచడంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రి తన శేష జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న ఈ లైబ్రరీనెక్ అభివృద్ధి లోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.ార్యక్రమంలో ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న.. సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రంలో.. జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్టించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ గారి విగ్రహాన్ని పరిశీలించిన అనంతరం.. సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కే ఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డా. జి. పార్వతి, లైబ్రరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేద్దాం

### జిల్లాలో మహానాడు నిర్వహణ ప్రతిష్టాత్మకం
### టిడిపి ఇంచార్జ్ రవీంద్రనాథ్ రెడ్డి



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** కడప పట్టణంలో చేపట్టబోయే మహానాడు కార్యక్రమాల విజయవంతం ప్రతిష్టాత్మకమైనవని పార్టీ పెద్దలు జిల్లాస్థాయి నాయకులపై ఉన్నటువంటి నమ్మకంతో అప్పగించినటువంటి బాధ్యతల విజయవంతనికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు . పులివెందుల టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసినటువంటి కార్యకర్తల సమావేశంలో మహానాడు విజయవంతానికి నాయకులు కార్యకర్తలు అవలంబించవలసినటువంటి విధి విధానాలపై సమాలోచనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు మా రెడ్డి జోగి రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా ఇతర తెదేపా శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# ఫిర్యాదు దారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

### జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్‌కుమార్



**కడప క్రైమ్ - మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" ( పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం ) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలు మూలల నుండి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్ బాబు, డి.టి.సి డి.ఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

# సీఎం జిల్లా పర్యటన విజయవంతం చేయండి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:** ఈ నెల 26 నుండి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై.. జేసీ అదితిసింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, నగర కమీషనర్ మనోజ్ రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటిస్తారన్నారు. ముఖ్యమంత్రికి అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రోటోకాల్ నిబంధనలను తప్పక పాటించాలి..**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా విధులు కేటాయించిన అధికారులందరూ.. ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పక పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధానంగా రాష్ట్ర మంత్రులతో పాటు హాజరయ్యే వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ మేరకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భద్రత లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యుత్, రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, ఏర్పాట్లతో పాటు పోలీసు, ఫైర్, ఏమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ను కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు విధులు కేటాయించిన అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 25వ తేదీ నాటికి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పనులన్నింటినీ పూర్తి చేసి.. సాంకేతిక మెటీరియల్ అన్నింటినీ ఒకసారి రీచెక్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో.. డీపీవో రాజ్యలక్ష్మి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, పోలీసు, ఫైర్ ఆఫీసర్ ధర్మా రావ్, విద్యుత్, ఆర్ అండ్ బి, పీఆర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పై అవగాహన కల్పించిన పోలీసులు



**మైదుకూరు, మేజర్‌న్యూస్ :** కడప జిల్లా మైదుకూరు మండలం జీవి సత్రం గ్రామంలో గ్రామసభ నిర్వహించి ట్రాఫిక్ పై అవగాహన కల్పించి, పిల్లలకు మోటారు సైకిళు ఇవ్వకూడదు అని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, హెల్మెట్ ఖచ్చితంగా ఉపయోగించాలని, గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే ముందస్తుగా పోలీసుల దృష్టికి తీసుకు రావాలని గొడవలు లేకుండా ప్రశాంతమైన వాతావరణం లో జీవించాలని మైదుకూరు అర్బన్ ఇన్స్పెక్టర్ కె. రమణా రెడ్డి తెలిపారు.

# మరమ్మత్తులకు నోచుకోని మైలవరం దక్షిణ కాలువ




ఎర్రగుంట్ల రూరల్ మేజర్ న్యూస్: ఎర్రగుంట్ల మండల పరిధిలోని ఉన్న మైలవరం దక్షణ కాలువ గోడలు పగిలిపోయి ప్రమాదకరంగా మారినవి ఈ మైలవరం కాలువ గోడలు మరమ్మతుకు నోచుకోనలేదు దీంతో కాలువలను నీరంతా వృధాగా ఇంకిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి దక్షణ మధ్య కాలువ జమ్మలమడుగు ఎర్రగుంట్ల కమలాపురం మీదుగా పోతుంది. ఈ గండికోట లోని నీరు నేరుగా కమలాపురంలోని చెరువులో కలుస్తాయి. ఈ కాలువ కింద సుమారు వందల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ కాలువ ద్వారా వచ్చే నీటితో రైతులు వరి ఇతర పంటలను పండిస్తూ ఉన్నారు. సమీపంలో ఉన్న ఆర్టీపిపి బూడిద నుంచి వస్తున్న ప్లైయాస్ నీరు కాలువలో ప్రవహిస్తున్నాయి. అక్కడక్కడ కాలువలో పూడికలు కూడా ఏర్పడ్డాయి. ఈ కాలంలో ఏర్పడిన ప్లైయాష్ బూడిద పూడికలను తీయడానికి ప్రతి ఏడాది ఆర్టీపీపీ నిధుల నుంచి లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ ఉన్నారు. అయినా పూడికలు మాత్రం అలానే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహం కూడా అక్కడక్కడ స్తంభించి కాలువ వెంబడి పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో నీటి పురాణం అడ్డంకే మారిందని రైతులు వాపోతున్నారు.

# నీలం సంజీవ రెడ్డికి భారతరత్న ప్రధానం చేయాలి

## డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లె, మేజర్ న్యూస్: స్వర్గీయ నీలం సంజీవ రెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు, నీతికి, నిర్భీతికి నిలువుటద్దం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసి రెడ్డి కొనియాడారు. సోమవారం సంజీవ రెడ్డి 112 వ జయంతిని వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ సంజీవ రెడ్డీ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని నాలుగేళ్ళు జైలు జీవితం గడిపాడన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, రాష్ట్ర మంత్రి , ఉప ముఖ్య మంత్రి , ముఖ్య మంత్రి ,కేంద్ర మంత్రి , లోక్ సభ స్పీకర్ ,రాష్ట్రపతి గా అనేక పదవులు అలంకరించి గొప్ప పరిపాలనాదక్షుడు అనిపించుకున్నారని తెలిపారు. ఏపీసీసీ అధ్యక్షునిగా, ఏఐసీసీ అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. స్వయంకృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు మాన్యుడు, అసమాన్యుడు కాగలరని, పల్లెటూరి వాసి ఢిల్లీ నేత కాగలడని సంజీవరెడ్డి నిరూపిం చారు. బస్సు రూట్ల విషయంలో సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ప్రతికూలంగా వ్యాఖ్యలు చేసినందుకు ముఖ్య మంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయాలలో నైతిక విలువలకు పెద్దపీట వేసిన నీతిమంతుడు. శ్రీశైలం డ్యాం, నాగార్జున సాగర్, శ్రీ వెంకటే శ్వర విశ్వవిద్యాలయం సంజీవరెడ్డి మానస పత్రికలు. ఔషధ మొక్కల్లో శ్రేష్టం సంజీవిని మొక్క, రాజకీయ నాయకులలో శ్రేష్టుడు సంజీవరెడ్డి. ఆయన జీవితం అందరికీ ఆద ర్శం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని తులసిరెడ్డి అన్నారు. సంజీవ రెడ్డికి భారత రత్న ప్రదానం చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, బద్రి, రామాంజనేయ రెడ్డి, ఉత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు కామ్రేడ్ సుందరయ్య : సిపిఎం మండల కార్యదర్శి



పోరుమామిళ్ల మేజర్ న్యూస్. పోరుమామిళ్లలోని జీ.బీనగర్ కాలనీ సిపిఎం పార్టీ కార్యాలయం నందు కామ్రేడ్ పుచ్చల పల్లి సుందరయ్య 40వ వర్ధంతి నిరుపేదల మధ్య జరుపుకోవడం జరిగిందని సిపిఎం పోరుమామిళ్ల మండల కార్యదర్శి ఎన్ భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 1913లో నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో ఒక ధనిక రైతు కుటుంబంలో జన్మించార న్నారు. ఆయన మహాత్మా గాంధీ ఆశయాలకు ఉత్తేజితులై 14ఏట మద్రాస్ రాష్ట్రంలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు హాజరై "సైమన్ గో బ్యాక్" ఆందోళనలో పాల్గొన్నారన్నారు. మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపుకు సంబంధించి ఆయన చదువుకు స్వస్తి చెప్పి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నాడని అన్నారు. కామ్రేడ్ అమీర్ ఖాన్ మార్గదర్శకత్వంలో సుందరయ్య కమ్యూనిస్టు పార్టీలో చేరాడన్నారు. తన వాటాకు వచ్చిన ఆస్తిని అమ్మి వేసి ఆ ధనాన్ని ప్రజా ఉద్యమాలకు ఖర్చు పెట్టారన్నారు. 1952లో సాధారణ ఎన్నికల తర్వాత సుందరయ్య మద్రాస్ అసెంబ్లీ నుంచి రాజ్యసభకు ఎన్నికైనారన్నారు. సుందరయ్య ఎంతో నిరాడంబరుడు. పార్లమెంటుకు, అసెంబ్లీకి సైకిల్ పైవెళ్లే వారన్నారు. 1985 మే 19న చనిపోయే వరకు ఆయన ప్రజలను దారిద్రం, వర్గపీఠం నుంచి విముక్తి చేసేందుకు పోరాడుతూనే ఉన్నాడన్నారు నిష్కళంక దేశభక్తుడుగా, నిస్వార్ధ స్వాతంత్ర యోధుడిగా, మహత్తర కమ్యూనిస్టు విప్లవకారుడుగా పీడిత ప్రజల ప్రియతమ నాయకుడిగా కామ్రేడ్ సుందరయ్య గారు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ గౌసియా బేగం మండల కమిటీ సభ్యులు మేరీ బీబీ రవి రత్నం షరీఫ్ ఓబులయ్య వెంకటలక్ష్మి ఫాతిమా, జమాల్ పాల్గొన్నారు.

# ఉప సర్పంచి ఎన్నిక విజయవంతం చేసిన అధికారులకు ధన్యవాదాలు

## మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: గోపవరం ఉప సర్పంచి ఎన్నిక విజయవంతం చేసిన అధికారులకు వైయస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రొద్దుటూరు మాజీ శాసన సభ్యులు రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం స్థానిక ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గోపవరం పంచాయితీ ఉపసర్పంచ్ ఎన్నిక విషయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి శాంతియుత వాతావరణంలో ఎన్నిక జరగటానికి సహకరించిన ఎన్నికల అధికారులకు, పోలీస్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గోపవరం పంచాయితీ ఉపసర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించటానికి తమ పూర్తి మద్దతు తెలుపుతూ తెలుగుదేశం పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ఇంతటి గొప్ప విజయానికి సహకరించిన గోపవరం వైయస్ఆర్సీపీ వార్డు సభ్యులందరికీ పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గోపవరం ఉపసర్పంచ్ సభ్యుడిగా ఎన్నికైన బీరం రాఘవేంద్ర రెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, పట్టణ వైసీపీ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, గోపవరం సర్పంచ్ మోష, వార్డ్ మెంబర్స్, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# నీలం సంజీవరెడ్డి సేవలు మరువలేనివి



కఢప టౌన్ మేజర్ న్యూస్: ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన స్వర్గీయ నీలం సంజీవరెడ్డి తన వంతు కృషి పట్టదలతో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఎన్నికై ప్రజలకు విశేష సేవలు అందించారని జెకె క్రీడా విద్యా సాంస్కృతిక అభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్ బాషా కొనియాడారు. సోమవారం వారి కార్యాలయం నందు నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి కేంద్ర మంత్రిగా కూడా దేశ ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు.తొలి ముఖ్యమంత్రి గా అప్పటి మన నూతన రాష్ట్ర అభివృద్ధికి తన వంతుగా ఆయన కృషి చేశారని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరిముల్లా, అమీన్, ఎజాస్, మున్నా తదితరులు పాల్గొన్నారు

# వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి : డిఎస్పి



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ పోరుమామిళ్ల పట్టణం మైదుకూరు రోడ్డులోని వసుంధర కళ్యాణ మండపం వద్ద సోమవారం మైదుకూరు డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్ రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనాలు అతి వేగంగా నడపరాదన్నారు. ముగ్గురు లేదా నలుగురు కలిసి ద్విచక్ర వాహనాలలో వెళ్ళరాదన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ కచ్చితంగా ధరించి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్య క్రమం లో పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్సై కొండారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశానికి సమగ్ర నివేదికతో రావాలి: ఎంపిపి



వేముల మేజర్ న్యూస్: వేముల మండలంలో రేపు జరిగే మండల సర్వసభ్య సమావేశంకు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిఒక్కరూ తప్పకుండా సమగ్ర నివేదికతో సమావేశం కి రావాలి అని వేముల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు చల్లా గంగాదేవి వెంకట నారాయణ అన్నారు. సోమవారం ఉదయం ఎంపీపీ చల్లా గంగా దేవి వెంకట నారాయణ మాట్లాడుతూ వేముల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తారీకు అనగా రేపు బుధవారం ఉదయం 10:30 నిమిషములకు, వేముల మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభా భవనం నందు జరుగును అని ,కావున మండల సాధారణ సర్వసభ్య సమావేశంకు సభ్యులందరూ హాజరుకావాలని మండలం లోని అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికతో సమావేశంకు రావాలి అని పేర్కొన్నారు. వేముల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశంకి జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు మరియు ఎంపీటీసీలు కో ఆప్షన్ సభ్యులు వీలు కలుగజేసుకుని తప్పక హాజరు కావాలన్నారు. ఆయా శాఖల అధికా రులు తప్పకుండా సమగ్ర నివేదికతో సమావేశంకి, సమయ పాలన పాటించి రావా లన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం సమావేశం ముగుస్తుంది అని వారు అన్నారు.

# బీటెక్ రవిని కలిసిన యురేనియం ప్రాంత గ్రామ ప్రజలు



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల నియోజకవర్గం వేముల మండలం తుమ్మలపల్లి యురేనియం ప్రాజెక్ట్ సంబంధించిన టైయిల్ పాండ్ వల్ల జరిగే అనర్థాల గురించి యురేనియం ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బిటెక్ రవి) ని కలిసి వివరించారు. ఈ టెలింగ్ పాండ్ వల్ల పచ్చని పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతింటున్నావి. నీరు కలుషితమై త్రాగునీరు, సాగు నీరు పూర్తి స్థాయిలో కలుషిత మెతున్నాయిని అని నష్టపరిహారం ఇవ్వాలని,మా భూములు కూడా తీసుకోని మాకు ఉద్యోగవాకాశాలు కల్పించాలని దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి చుట్టు పక్కల గ్రామంలోని ప్రజలను కాపాడవలసిందిగా బీటెక్ రవిని యురేనియం ప్రాంత గ్రామ ప్రజలు కోరారు. యురేనియం ప్రాంత గ్రామ ప్రజల కోరిక మేరకు రేపు ఉదయం టైలింగ్ పాండ్ ను అధికారులతో కలిసి పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాను అని మీకు తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడం జరిగింది.

# విజ్ఞానాన్ని సృజనాత్మకతను విద్యార్థులు అలవర్చుకోవాలి

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోదాన్ని ప్రారంభించిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా

కడప సిటీ మేజర్ న్యూస్ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈరోజు కడపలోని ఆర్కే నగర్ లో ఉన్న ఉర్దూ పాఠశాలలో 'వేసవి వినోదం' పేరిట సమ్మర్ క్యాంపును ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి వినోదం పేరిట ఈరోజు ప్రారంభించిన సమ్మర్ క్యాంపు పిల్లల బుద్ధిని వికసింపజేసే ఒక సృజనాత్మక వేదిక అని పేర్కొన్నారు. ఇటువంటి వేదికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జె .వి.వి నగర అధ్యక్షులు శివరామాట్లాడుతూ మన సమాజంలో ప్రజలలో విజ్ఞానాన్ని నింపాలన్న లక్ష్యంతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. ఇటువంటి సమ్మర్ క్యాంపులు పిల్లలలోని కళా ప్రతిభను వెలికి తీయడమే కాకుండా ఆలోచన సామర్థ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఐద్వా అధ్యక్షురాలు సుబ్బమ్మ పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంపు జూన్ 5వ తేదీ వరకు కొనసాగుతుందని ఇందులో చిత్రలేఖనం, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు, ఓరిగామి, పాటలు, మట్టి బొమ్మల తయారీ మొదలగు అంశాలపై నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్ల చేత అవగాహన కల్పించడం జరుగుతుందని, విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాజరై దీనిని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, పాఠశాల చైర్ పర్సన్ మహబూబ్ బాషా, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గఫూర్ ,రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు రెడ్డి, రంగనాయకులు, కామేశ్వరమ్మ, లక్ష్మీదేవి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా కండిస్తున్నాం

## వైస్సార్సీపీ పులివెందుల తాలూకా సెల్ అధ్యక్షులు అగ్రహారం రవి



లింగాల మేజర్ న్యూస్ : లింగాల మండలంలోని వైఎస్ఆర్సిపి పులివెందుల తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి మాట్లాడుతూ తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిని అదే కళాశాలలో జూనియర్ అయినటువంటి అగ్రకులస్తుడు కులం పేరుతో దూషిస్తూ బంధించి చిత్రహింసలకు గురి చేస్తూ డ్రాయర్ నోట్లో కుక్కి, మూత్రం పోసి హింసించిన సంఘటన తీవ్రంగా కలిసి వేసింది. రోజు దళితులపై ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. పోలీస్ స్టేషన్లకు వెళితే న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోవడమే కాకుండా ఫిర్యాదు దారుల మీద కేసులు పెడుతూ చాలా ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుంది. జేమ్స్ మీద దాడి జరిగి గంటలు గడుస్తున్న మందకృష్ణ మాదిగ స్పందించక పోవడం బాధాకరమని అన్నారు.ఘటనకు కారకులైన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని వైస్సార్సీపీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

# కర్ణాటక ప్రభుత్వం రాష్ట్ర క్రిస్టియన్ మండలి నిర్దేశకులుగా,తెలుగుబిడ్డ, గుడిమే జోసెఫ్ రవికుమార్ నియామకం

కలసపాడు మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం కలసపాడు మండలంలోని పుల్లారెడ్డి పల్లె గ్రామానికి చెందిన క్రీ. శే..గుడిమే జాన్ గుర్రప్ప క్రీ. శే.. సుశీలమ్మ కుమారుడు జోసెఫ్ రవికుమార్ కర్ణాటక రాష్ట్రం లోని బళ్ళారి లో నివాసం ఉంటున్న గుడిమే జోసెఫ్. రవికుమార్‌ను కర్ణాటక రాష్ట్ర క్రిస్టియన్ మండలి నిర్దేశకులుగా నియమించడం అభినందనీయమని కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని అభిమానులు సంబరాలు జరుపుకున్నారు కర్ణాటక రాష్ట్రప్రభు త్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి ఒక ప్రత్యేక దృష్టి నిలిపి మా కడప జిల్లా లోని కలసపాడు మండలం పుల్లారెడ్డిపల్లె వాసియైన గుడీమె జోసెఫ్ రవికుమార్ ప్రతిభను గుర్తించి కర్ణాటక ప్రభుత్వం ఇవ్వటంపై హర్షం వ్యక్తం చేస్తూ రవికుమార్ కు బంధువులు మిత్రులు స్నేహితులు హృదయ పూర్వక అభినందనలు తెలియ జేశారు కర్ణాటక ప్రభుత్వ అధికారులకి పెద్దలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# భూ కబ్జాలోఎవరికి ఎవరు తగ్గేదే లేదు

## వైయస్సార్సీపి కూటమి ప్రభుత్వం దొందు దొందే!

## లోక్ తంత్రిక జనతా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బూరగ రత్నం




పోరుమామిళ్ల మేజర్ న్యూస్ బద్వేలు నియోజకవర్గంలో వేలఎకరాల దళితులభూమి, ప్రభుత్వభూమి కబ్జా చేయడంలో వైస్సార్సీపికి కూటమి ప్రభుత్వం తగ్గేదిలేదు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని భూములను తక్షణమే స్వాధీనం చేసుకొని పేదలకు పంచి పెట్టాలని లోక్ తంత్రిక జనతా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బూరగ రత్నం డిమాండ్ చేశారు. కడపజిల్లా పోరుమామిళ్ళ పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ పరిధిలోని 7 మండలాలలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు.బద్వేల్ నియోజక వర్గంలో కాశినాయన మండలంలో దాదాపు రెండు వేల ఎకరాల భూమిని వైస్సార్సీపి నాయకులు ఆక్రమించి హైదరాబాద్, రాయచూరు, విజయవాడ, రాజమండ్రి,తెలంగాణ,గుంటూరు,తాడిపత్రి,బెంగుళూరు తదితర ప్రాంతాలకు రాజకీయ నాయకులు, భూస్వాములు నకిలీ పట్టాదారు పాసు బుక్కులు, పత్రాలతో ప్రభుత్వ భూములను బహిరంగంగా ఆక్రమిస్తే మీకేమీ మేము తక్కువ కాదు అన్నట్లుగా ప్రస్తుత కూటమి ప్రభుత్వ నేతలు,నాయకులు యథేచ్ఛగా ఆక్రమించి, స్థానికులకు సెంటుభూమి దక్కనీయకుండా చేశారన్నారు.వీటన్నిటిపై కూటమి ప్రభు త్వం సమగ్ర విచారణ జరిపి ఆక్రమణదారుల నుండి భూములను స్వాధీనం చేసుకొని తక్షణమే వాటిని రద్దుచేసి పేద,బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఒక్కోకుటుంబానికిరెండు ఎకరాల భూమిని పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ, టిడిపి, జనసేన హిందూవులు కాదని, ఆర్యన్లు వారి బానిసలు అన్నారు. కాశీనాయన మండలం జ్యోతి క్షేత్రంలో అన్నదాన సత్రా లు,భవనాలు పడగొట్టి పాపం చేశారన్నారు.బద్వేలు నియోజవర్గంలో ఎక్కువగా భూసమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలంటూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టిపట్ట నట్లు వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నార న్నారు.పంటలు పండించే రైతుకు భూమి,నీరు, ఎరువు, మందులు అందించని పార్టీలను చేయిచేయి కలిపి ఓడిద్దామని పిలుపునిచ్చారు.బద్వేలునియోజవర్గంలో కూటమి ప్రభుత్వం చొరవతో పరిశ్రమలు తీసుకొచ్చి, నిరుద్యోగ సమస్య నుపరిష్కరించాలని డిమాండ్ చేశారు .మహిళలకు రిజర్వేషన్లలో 50% వాటా, సమానత్వం హిందూ కోడ్ బిల్లుతో, బీసీలకు 50% వాట సమానత్వం మండల సిఫార్సులతో, ముస్లింల న్యాయమైన వాటా సమానత్వం సదర్ సిఫార్సులతో, క్రిస్టియన్లకు న్యాయమైన వాటా సమానత్వం రక్షణతో, ఎస్సీ మాదిగలు, మాలల ఓట్లు చీల్చి వారిని పాలకులు కాకుండా చేసే పార్టీలను ఓడిద్దామని, అలాగే 20% వాటా సమానత్వం ప్రత్యేక నియోజకవర్గాలతో రాజ్యాంగ హక్కులు తెచ్చుకోవడానికి ఓటు సద్వినియోగ చైతన్యంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జూన్ లో జరిగే జాతీయ సమా వేశం ఢిల్లీ మరియుఆగస్టు లో జరిగే రాష్ట్ర సమావేశంకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# 22న జరిగే శోభాయాత్రను జయప్రదం చేయండి



ఎర్రగుంట్ల రూరల్ మేజర్ న్యూస్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన వీర హనుమాన్ జన్మ దిన దినోత్సవం సందర్భంగా ఎర్రగుంట్ల పట్టణంలో శోభాయాత్ర జరుగుతుంది. ఈ శోభాయాత్రలో హిందువులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎర్రగుంట్ల విశ్వహదూ పరిషత్ సభ్యులు కోరారు. సోమవారం ఎర్రగుంట్ల విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో వారు సమావేశం అయినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ సురక్ష, దేశ సురక్ష, గోరక్ష , జాతి సురక్ష మహిళా సురక్ష, ధర్మరక్ష హిందూ తత్వ రక్షణకై బభజరంగ్ దళ్ సమాజం అవుతుందన్నారు అందులో బాగానే ఈ శోభాయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి హిందువు ఈ శోభయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ శోభాయాత్ర ఎర్రగుంట్ల పట్టణంలో ముద్దనూరు రోడ్డు లోని నడివూరు రామాలయం వద్ద నుండి సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కావున హిందువులందరూ కలిసి సంఘటితంగా ఈ యాత్రలో పాల్గొని మన సనాతన హిందూ ధర్మాన్ని రక్షించుకోగలమని చాటి చెప్పాలన్నారు.

# ప్రజా సంక్షేమాన్ని మరిచిన కూటమి ప్రభుత్వం

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా



పెండ్లిమర్రి మేజర్ న్యూస్. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేశారని కడప జిల్లా పెండ్లిమర్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్. మహబూబ్ బాషా, పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం మరిచారని.ఉచిత బస్సు కోసం మహిళలు ఎదురు చూపులు చూస్తున్నారని మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురుచూపులు..నిరుద్యోగ యువత 20,లక్షల ఉద్యోగాలకోసం ఎదురు చూపులు చూస్తున్నారని.. నెలకు 1500 వందల రూపాయలు వస్తాయని మహిళలు, నెలకు 3000 వేల రూపాయలు వస్తుందని నిరుద్యోగులు ఎదురు చూపులు,,.ఉచిత సిలిండర్ పేరుతో కుచ్చు టోపి పెట్టారని.ప్రతి పేదవాడికి రెండు సెంట్లు ఇంటి స్థలం ఇస్తారని .ప్రతి పేదవాడికి నాణ్యమైన మెటీరియల్ తో ఇంటి నిర్మాణం కోసం ఎదురుచూపులు.. అభివృద్ధి లేక పూర్తిగా రోడ్లన్నీ గుంతల మయం, రాష్ట్రంలోఅన్ని రకాల వ్యాపారాలు తగ్గిపోయాయని.. రాయలసీమ వ్యాప్తంగా కరువు ఛాయలు అలుము కున్నాయని.., ప్రజలు పనులు దొరకక పస్తులు ఉండే కాలం ఏర్పడుతోందని. రైతులకు ఇచ్చిన హామీ 20,000 వేల రూపాయలు పథకం అమలు చేయలేదు.రైతులు అరకోర పంటలు పండిస్తే గిట్టుబాటు ధర లేక పొలాల్లోనే పంటను వదిలేసేపరిస్థితి. నేడు.కనబడుతోం దని, రైతుల దగ్గర పెట్టుబడి లేక అరకొర పంట కూడా పండించడం లేదు..పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు పెట్టుబడి రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.రైతులు సైతం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందనీ.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడేలా కృషి చేయాలని ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు.

# అందుబాటులో పశువుల దాణా, పశుగ్రాస విత్తనాలు

## వెటర్నరీ డాక్టర్ వెల్లడి



పెండ్లిమర్రి,, మేజర్ న్యూస్ పశు సంవర్ధక శాఖ తరపున పశుగ్రాస విత్తనాలు మరియు పశువుల దాణా 50% సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని మొదటి విడతగా ఏడు టన్నుల పశువుల దాణా అందుబాటులో ఉందని, పాడి రైతులకు ఒక్కొక్కరికి 50 కేజీలు మాత్రమే ఇచ్చే విధంగా నిర్ణయించారని, మొత్తం 50 కేజీల ధర 1110 రూపాయలు కాగా సబ్సిడీ 555 రూపాయలు, రైతు వాటా 555 ఉంటుందని పెండ్లిమర్రి పశుసంవర్ధక శాఖ వైద్యులు తెలిపారు..

# అరుణారుణ వేగుచుక్క కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య : సిపిఎం



జమ్మలమడుగు మేజర్ న్యూస్: నెల్లూరు జిల్లా అలగాని పాడు గ్రామంలో 1913 మే 1న ఒక ధనిక రైతు కుటుంబంలో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య. ఆయన 13వ ఏటా నుంచే అంట రానితనం వెట్టిచాకిరి వంటి సామాజిక దురాచారాలను నివసించే వారు. ఆయన 1985 మే 19న మరణించడం జరిగిందని జమ్మల మడుగు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జి. ఏసుదాసు తెలిపారు.ఈ సందర్భంగా జమ్మలమడుగు సిపిఎం పార్టీ స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన గురించి మాట్లాడుతూ అవిశ్రాంత పోరాట యోధుడు..దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత..ప్రజాసేవకోసం పిల్లల్ని సైతం వద్దనుకున్న మహా నేత...వారసత్వంగా వచ్చిన ఆస్థి ని పార్టీ కి ఇచ్చిన త్యాగ ధనుడు.ప్రజా గొంతుకగా నిలిచిన గొప్ప పార్లమెంటేరియన్... పార్లమెంటుకు, అసెంబ్లీకి సైకిల్ పై ఫైళ్ళను కట్టుకుని వెళ్లిన గొప్ప నాయకుడు. ఈయన అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి అనే ఉండేది.కానీ తన పేరు కులాన్ని సూచిస్తోందని కులం తోకను తీసేసి పుచ్చలపల్లి సుందరయ్యగా పేరు మార్చుకున్న ఆదర్శనీయుడు..సొంత ఊర్లోనే మొదటిసారిగా కూలి సంఘం పెట్టిన నాయకుడు...తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడని, స్వాతంత్ర సమరయోదుడు, కమ్యూనిస్టు గాంధీగాను పేరుపొందారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ఏమేమి చేస్తే బావుంటుందోనని వాటన్నిటిని గ్రంధస్తం చేసిన రచయిత..నైజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం ,నడిపిన పోరాట యోధుడు...ఆయన ఆశయాలను ప్రతి పేద కుటుంబాలను పేదరికం నుంచి అంటరానితనం నుంచి కులం పేరుతో దూషిస్తున్న వారి నుంచి విముక్తి కల్పించేంతవరకు కమ్యూనిస్టు ఉద్యమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణం కమిటీ సభ్యుడు ఏ.వినయ్ కుమార్, సిపిఎం నాయకులు వెంకటయ్య , ప్రభాకర్,భాషా, సుద్దపలెచంటి తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు



కలసపాడు మేజర్ న్యూస్: కలసపాడు మండలంలోని ముద్దం వారి పల్లె గ్రామంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సగిలి గురయ్యా ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి నీ జరుపు కోవడం జరిగింది గ్రామంలోని మహిళలు దళితులు వ్యవసాయ కార్మికులు పాల్గొని పుచ్చలపల్లి సుందరయ్యకు పూలమాలలు వేసి జోహార్లు చెప్పారు ఈ సందర్భంగా కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి గురించి కార్మికులకు మహిళ దళితులకు సుందరయ్య గురించి తెలియజేస్తూ 1913 మే నెల 1 తేదీ కొవ్వూరు నియోజకవర్గం అలాగానిపాడులో ధనిక భూస్వామి కుటుం బంలో జన్మించారని తెలిపారు 14 సంవత్స రాల వయసులోనే అంటరానితనానికి వ్యతిరే కంగా సామాజిక అసమనతాలు సరికాదని చెప్పేవాడని కుటుంబ సభ్యులతోనే గొడవ పెట్టుకుని తన ఇంట్లో అందరికీ ఒకే భోజనం చేసేలా తన కుటుంబాన్ని మొదటగా సంస్క రించాలన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థుల కు నాయకత్వం వహించి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు చేశారన్నారు ప్రాము ఖ్య కమ్యూనిస్టు నాయకులు అమీర్ హైదరా ఖాన్ పరిచయంతో పరిపూర్ణమైన కమ్యూని స్టుగా శిక్షణ పొందారన్నారు ప్రజారాజ్యం ఆంధ్రప్రదేశ్లో సమగ్ర నీటి పథకం లాంటి ప్రత్యమాయ ఆలోచనలు రచనలు చేశార న్నారు పార్లమెంటులోనూ అసెంబ్లీలోను ప్రజల ముందు పెట్టి ఆలోచింప చేశారన్నారు 1985 మే 19వ తేదీ అనారోగ్యంతో మరణించే వరకు కూడా కమ్యూజమే సరైన రాజకీయ దృకప్ ద మనీ దోపిడి వర్గాలపై పదునైన వ్యాసాలు రాసి కమ్యూనిస్టు చేనులను చైతన్య పరిచారని గుర్తు చేశారు ప్రభుత్వం వారికి పూర్తిగా సహకరించి వత్తా పలుకుతోందని ఆరోపిం చారు సిపిఎం శ్రేణులు ఉమ్మడి ప్రయోజనాల పట్ల ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు

# జాతీయ స్థాయి కీర్తి రత్న పురస్కార అవార్డ్ అందుకున్న గోపాల కృష్ణయ్య




దువ్వూరు, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన దువ్వూరు పట్టణం నందు శ్రీ వినాయక ఫౌండేషన్ టీం చేస్తున్న అనేక రకాల సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి జిల్లా, మంతిని పట్టణంలోని శ్రీ గౌతమేశ్వర సాహితీ సేవా సమితి చైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రీ వినాయక ఫౌండేషన్ చైర్మన్ దీటి గోపాలకృష్ణయ్య కు జాతీయ కీర్తన పురస్కార అవార్డు ను స్వర్ణ కంకణం మొమెంట్ తో పాటు ఘనంగా సత్కరించి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వినాయక ఫౌండేషన్ టీం చేస్తున్న సేవలను కొని యాడడం జరిగింది. దువ్వూరు గ్రామస్తునికి కీర్తి రత్న అవార్డు రావడంతో మండల వ్యాప్తంగా ప్రజలు అభినందించడం జరిగింది. సందర్భంగా శ్రీ వినాయక ఫౌండేషన్ చైర్మన్ డిటిగోపాల కృష్ణయ్య మాట్లాడుతూ మా ఫౌండేషన్కు సహకరిస్తున్న దాతలకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

# స్మశాన వాటిక నిర్మాణానికి భూమి పూజ



చాపాడు మేజర్ న్యూస్: ఎన్నికల ముందు ప్రతి గ్రామంలో స్మశానవాటికల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చానని ఆ హామీ మేరకు సోమవారం నాగులపల్లె గ్రామంలో స్మశాన వాటికకు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సంధర్భంగ ఆయన మాట్లాడుతూ స్మశానాల అభివృద్ధికి నియోజకవర్గానికి 5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేపించానని అలాగే పైలెట్ ప్రాజెక్టు కింద తొలి దశలో 25 గ్రామాల్లో స్మశాన వాటికల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్నమన్నారు.ఒక్కోక్క స్మశాన వాటికకు 20 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రెసిడెంట్ పల్లవోలు సుధాకర్ రెడ్డి,డిస్ట్రిబ్యూటరి ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మెన్ ద్వార్శల గురువిరెడ్డి, మండల మాజీ ప్రెసిడెంట్ యాపర్ల వెంకటసుబ్బారెడ్డి, పల్లవోలు ప్రభాకర్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

## డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్ , ఇన్చార్జి ఎంపీడీవో హరికృష్ణ



దువ్వూరు, మేజర్ న్యూస్ : మండల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్, ఇంచార్జి మండల అభివృద్ధి అధికారి హరికృష్ణ యాదవ్లు మండల అధికారు లను ఆదేశించారు. సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ప్రజ లు ఇచ్చిన అర్జీలకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శ కంగా విచారణ జరిపి వారికి న్యాయం చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వివిధ రకాల అర్జీలు అందించారు. వీటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని మండల అధికారులకు సూచించారు. అలాగే జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్లో మండల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వీడియో కాన్ఫరెన్స్ అధికారులతో మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి సమస్య ఎక్కడ కనిపించ కూడ దని సూచించారు. అలాగే ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 గంటల నుంచి పనికి వెళ్లేలా చూడాలని అధికారులు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివ కుమార్, ఉపాధి హామీ ఏపిఓ లక్ష్మీనారాయణ,ఐసిడిఎస్ సూపర్వైజర్లు వరలక్ష్మి, సౌజన్య, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,వీఆర్వోలు పాల్గొన్నారు.

# అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

## అధికారులు అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు

## డిఆర్వో విశ్వేశ్వర నాయుడు

**కడప ప్రతినిధి – మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని పరిశీలిస్తే..కడప నగరం రామచంద్రపురం కు చెందిన షేక్ హుస్సేన్ పీరాన్ తనకు 60 సంవత్సరాలు వచ్చాయని వృధ్యాప్య పింఛను మంజూరు చేసి ఇవ్వాలని అభ్యర్తించారు. చెన్నూరు మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ సలాం తన భూమికి హద్దులు చూపి ఆక్రమణ నుండి కాపాడాలని విన్నవించారు. వల్లూరు మండలం అంబవరం కు చెందిన సి. ఆదినారాయణ రెడ్డి తన భూమిని ఆన్లైన్ లో నమోదు చేయాలని అభ్యర్తించారు. కడప చెమ్ముమియా పేటకు చెందిన కె.



గోవిందయ్య తనకు టిటిసి శిక్షణ కు అర్హత ఉన్న తరగతుల కు హాజరు కావడానికి అనుమతి ఇవ్వడం లేదని టిటిసి ట్రైనింగ్ సెంటర్ వారి ఈ విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈవో ఓబులమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, సర్వే ల్యాండ్ అధికారి మురళి కృష్ణ, ఎస్డీసీలు శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మినీ మహానాడును జయప్రదం చేయండి

## ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి




ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: నేడు జరిగే ప్రొద్దుటూరు నియోజకవర్గ మహానాడును జయప్రదం చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి టిడిపి శ్రేణులకు, నందమూరి అభిమానులకు, కూటమి నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 1982 స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి, 1983 సంవత్సరంలో ఎన్నికలలో పోటీ చేసి తెలుగుదేశం పార్టీ విజయం సాధించిందని, ఈ నేపథ్యంలో 1983 సంవత్సరం నుండి ప్రతి ఏడాది తెలుగుదేశం పార్టీ సాంప్రదాయ ప్రకారం మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ ఏడాది కడప లో ఏర్పాటు చేస్తున్న మహానాడు బహిరంగ సభ 27,28,29 మూడు రోజుల పాటు నిర్వహించనున్నారని తెలిపారు. కాగా నేడు ప్రొద్దుటూరులో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని భారత్ ఫంక్షన్ హాల్ దగ్గర ఏర్పాటు చేస్తున్న మినీ మహానాడు విజయవంతం చేయాలని కార్యకర్తలకు అభిమానులకు పార్టీ నాయకుల కు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఇ.విసుధాకర్ రెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.

# వీధి నాటకం ద్వారా హెచ్.ఐ.వి / ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ మరియు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం ఆదేశాల మేరకు సోమవారం చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటి ఆధ్వర్యంలో జయశంకర్ కళాకారుల బృందం ద్వారా వై ఎం ఆర్ కాలనీ సర్కిల్ నందు హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ పై వీధినాటక రూపంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్.ఐ. వి./ ఎయిడ్స్/ టి.బి. గురించి తెలియ జేస్తూ హెచ్.ఐ.వి. కేవలం 4 రకాలుగా వస్తుందని 1. సురక్షితం కానీ లైంగిక సంబంధాల ద్వారా, 2. కలుషిత సూదులు, సిరంజీల ద్వారా, 3. కలుషిత రక్త మార్పిడి ద్వారా, 4. హెచ్.ఐ.వి. సోకిన తల్లి నుండి బిడ్డకు వస్తుందని చెప్పారు. అలాగే హెచ్.ఐ.వి. వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రతలు మరియు, హెచ్.ఐ.వి. ఉన్న గర్భిణీ స్త్రీల నుండి పుట్టబోయే బిడ్డలకు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, హెచ్.ఐ.వి 2017 యాక్ట్ గురించి వీధి నాటక రూపంలో కళ్ళకు కట్టినట్లు అవగాహన కలిగించారు. హెచ్.ఐ.వి సోకిన వ్యక్తిని వివక్షకు గురిచేయరాదని, హెచ్.ఐ.వి సోకిన ప్రతి వ్యక్తికి ఏ.ఆర్.టి సెంటరులో ఉచితంగా మందులు ఇస్తారని, హెచ్.ఐ.వి /ఎయిడ్స్ పై సమాచారం, సలహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1097కు కాల్ చేసి సందేహాలను తీర్చుకోవచ్చు అని వీధి నాటక రూపంలో జయశంకర్ కళాబృందం వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిర్డ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ పి. నరేష్ కుమార్, పుల్లయ్య, ఐసిటి సి కౌన్సిలర్ బాలగంగి రెడ్డి, మరియు సి ఇ ఆర్ డి ఎస్ సిబ్బంది ఓలమ్మ, భాగ్యలక్ష్మీ, సునీత, ఉమా మహేశ్వరి, పీర్ ఎడ్యుకేటర్స్, పాల్గొన్నారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి

కడప ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే -25కు సంబంధించి ఈరోజు అనగా 19-05-2025 కడప జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు' జరగకుండా పరీక్షల నిర్వహణ ఏకధ్బందీగా జరిగింది. జిల్లాలో 28 సెంటర్స్‌లలో ప్రైవేట్ అబ్యార్ధులకు 956 మందికి గాను 721 మంది హాజరు అయ్యారు. అందులో 235 మంది గైర్హాజరు అయ్యారు. జిల్లాలో 4 మంది ఫ్లయింగ్ స్వాడ్ బృందాలు 11 సెంటర్లను కడప నందు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్. యస్. షంషుద్దీన్ 3 సెంటర్స్‌లో మొత్తం 14 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు, జిల్లా నందు ప్రశాంత వాతవరణంలో పరీక్షలు జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ యస్.షంషుద్దీన్ తెలిపారు.

# దేశభద్రతలో సైనికుల సేవలు వెలకట్టలేనివి

## తిరంగా ర్యాలీకి పోటెత్తిన సంఘీభావం...ఆపరేషన్ సిందూర్" విజయవంతం





పులివెందుల మేజర్ న్యూస్ దేశానికి సేవలందిస్తున్న భారత సైనికుల గొప్పతనాన్ని గౌరవిస్తూ దేశ భద్రత కోసం తన ప్రాణాలను అర్పించే జవాన్లకు సంఘీభావంగా సోమవారం పులివెందుల పట్టణంలో ఆపరేషన్ సింధు విజయోత్సవాన్ని పురస్కరించుకొని కూటమి సభ్యులు మరియు ప్రజల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీకి ప్రజలు పోటెత్తారు. పులివెందుల మున్సిపాలిటీ నందు "ఆపరేషన్ సిందూర్" విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా పట్టణంలోని పాత బస్టాండ్ నుండి పూల అంగళ్ల సర్కిల్ " వరకు కూటమి నాయకులు,కార్యకర్తలతో కలిసి తిరంగా యాత్ర (ర్యాలీ) కొనసాగగా పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి),మారెడ్డి లతా రెడ్డి బిజెపి నాయకుడు శశిభూషణ్ రెడ్డి తదితరులు త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకొని ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత త్రివిధ దళాలకు అభినందనలు తెలుపుతూ, వారి పోరాట పటిమకు, సేవలకు సంఘీభావంగా తిరంగా యాత్ర(ర్యాలీ)లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రధాన మార్గాల ద్వారా జై జవాన్, వందేమాతరం, త్రివర్ణ పతాకాలు చేతబట్టి, దేశభక్తి గీతాలు ఆలపించడంతోపాటు దేశ రక్షణ పై అవగాహన పెంచే నినాదాలతో ప్రజలు స్ఫూర్తిని నింపారు. ఈ తీరంగా ర్యాలీలో కూటమి నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వేముల మండల టిడిపి నాయకుడు పార్థసారధి రెడ్డి, వేంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, టీబీ హెల్పి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి గారు,మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఇండియా పాక్ దౌత్య సంబంధాల సమావేశంలో పాల్గొన్న ఎంపీ అవినాష్ రెడ్డి

పులివెందుల అర్బన్ మేజర్ న్యూస్ పాకిస్తాన్లోని ఉగ్రవాద స్తవరాలను మట్టి కలిపిన అనంతరం ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య ప్రస్తుతం ఉన్న దౌత్య సంబంధాలపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ఢిల్లీ లో భారత విదేశాంగ కార్యదర్శి విక్రం మిశ్రి ఇచ్చిన బ్రీఫింగ్‌లో పాల్గొన్న విదేశీ వ్యవహారాల కమిటీ సభ్యులు, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ,విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శశిథరూర్ తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

